www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

బుధవారం, 22-07-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :82 Issue : 82 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్ పై సీఎం చంద్రబాబు సమీక్ష..



3




## చరిత్ర సృష్టించడమే మా లక్ష్యం..

8




# కొడంగల్ ప్రాజెక్టు భూసేకరణ వేగవంతం చేయండి

- మక్తల్–నారాయణపేట్–కొడంగల్ ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి
- భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశం
- ఏ తండాకూ రోడ్డు లేదనే పరిస్థితి ఉండొద్దు – ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలి
- కొత్త పంచాయతీ భవనాల పర్యవేక్షణకు ప్రత్యేకంగా 'ఈఈ' (EE) స్థాయి అధికారి నియామకం
- ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

3

## హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి

- హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌పై సీఎం రేవంత్ ఫైర్.. పనుల్లో జాప్యంపై అధికారులకు హెచ్చరిక!
- నెలకు ఒకసారి సైట్‌లోనే బస చేస్తా.. ఎడ్యుకేషన్ హబ్ పనుల వేగంపై సీఎం సమీక్ష

3





# మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్!

- ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా.. రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
- ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత

3



## నీళ్ల నిర్వహణపై కాంగ్రెస్‌కు అవగాహన లేదు



- ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు: హరీశ్ రావు
- దేవాదుల నుంచి నీళ్లు రాక రైతులు నష్టపోయారన్న హరీశ్
- దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా ఉత్తమ్ కు తెలియదని ఎద్దేవా
- నీళ్ల నిర్వహణపై ప్రభుత్వానికి అవగాహన లేదని విమర్శ

2

## పగటి పూట సోలార్‌తో తగ్గనున్న ఆర్థిక భారం

- వ్యవసాయం, తాగునీరు, విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా తెలంగాణ ప్రభుత్వ కార్యాచరణ.
- పగటి పూట సౌర విద్యుత్ వినియోగంతో విద్యుత్ ఖర్చులకు బ్రేక్.
- వర్షా కాలంలోనూ వేసవి స్థాయి పవర్ వినియోగం.. పక్కాగా ఎనర్జీ మేనేజ్‌మెంట్

2





## మంగళగిరిలో నారా లోకేశ్ 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

- మంగళగిరిలో 1331 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- 'మన ఇల్లు – మన లోకేశ్' కార్యక్రమానికి శ్రీకారం
- సుమారు 7.30 గంటల పాటు నిలబడే పట్టాలు అందించిన మంత్రి లోకేశ్
- లబ్ధిదారులకు పట్టాతో పాటు నూతన వస్త్రాలు బహూకరణ

2



## రాజకీయ నాటకాలు వద్దు

- కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- పార్లమెంటులో చర్చించకుండా రాజకీయం చేస్తున్నారని మండిపాటు
- వరుస ఎన్నికల్లో ఓడినా కాంగ్రెస్ తీరు మారడం లేదని వ్యాఖ్య
- బాధ్యతాయుత ప్రతిపక్షం కావాలి కానీ, నిరంతరం ఆందోళన చేసేది కాదంటూ హితవు

2

## రైతులను పట్టించుకోని రేవంత్ సర్కార్

- రైతు సదస్సులో బీఆర్ఎస్ కేటీఆర్ విమర్శలు
- చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 5 లక్షల చెక్కులు అందించిన కేటీఆర్
- రుణమాఫీ, ఉద్యోగాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్
- మంచిర్యాల ఎమ్మెల్యే, కలెక్టర్ తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం

3



## దేవాదులకు ప్రథమ ప్రాధాన్యం..





- తాగునీరు, పశుగ్రాస కొరత లేకుండా ప్రత్యేక చర్యలు
- ఎల్‌నీనో ముప్పు – అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం!
- వర్షా భావ పరిస్థితులపై మంత్రులు పొంగులేటి, పొన్నం సమీక్ష
- ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులు – వరంగల్‌కు ఐఏఎస్ దేవసేన

2

## షూటింగ్ స్పాట్‌లో హీరో బాలకృష్ణకు స్వల్ప గాయం

- షూటింగ్‌లో నందమూరి బాలకృష్ణకు ప్రమాదం.. మోకాలికి గాయం!
- కాకినాడ పోర్ట్‌లో 'NBK111' షూటింగ్.. ప్రమాదవశాత్తు కిందపడ్డ బాలయ్య!
- బాలకృష్ణకు స్వల్ప గాయం: ఆందోళన చెందవద్దు అన్న వైద్యులు!
- గోపీచంద్ మలినేని సెట్స్‌లో ఘటన: బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిపై లేటెస్ట్ అప్‌డేట్!



ఆశ్వి అప్డేట్స్

స్టార్ హీరో, నటసింహం నందమూరి బాలకృష్ణ ప్రమాదానికి గురయ్యారు. కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తాజా చిత్రం (NBK111) షూటింగ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్

మిగతా 2వ పేజీలో..


# నీళ్ల నిర్వహణపై కాంగ్రెస్‌కు అవగాహన లేదు

- ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు: హరీశ్ రావు
- దేవాదుల నుంచి నీళ్లు రాక రైతులు నష్టపోయారన్న హరీశ్
- దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా ఉత్తమ్ కు తెలియదని ఎద్దేవా
- నీళ్ల నిర్వహణపై ప్రభుత్వానికి అవగాహన లేదని విమర్శ



హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను నమ్మి దేవాదుల ప్రాజెక్టు కింద నారుమడులు పోసుకున్న రైతులు ఇప్పుడు నీళ్లు లేక తీవ్రంగా నష్టపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మాటలు నమ్మి నాట్లు వేసుకుంటే, ఇప్పుడు నీళ్లు రాక ఆ నారుమడులన్నీ ముదిరిపోయి పుచ్చిపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు.
దేవాదుల నుంచి 38.16 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, 22 రిజర్వాయర్లను నింపి ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం డైలాగులు కొట్టిందని విమర్శించారు. అసలు ఆ నీళ్ల మంత్రికి దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా తెలియదని హరీశ్ ఎద్దేవా చేశారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి నీళ్ల నిర్వహణపై కనీస అవగాహన లేదని విమర్శించారు. దేవాదుల అనేది బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టు అని, ఆ విషయం కూడా కాంగ్రెస్ నాయకులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం విషయంలో కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసిన ప్రభుత్వం... మరి దేవాదుల వద్ద నీళ్లు ఎత్తడానికి ఏం అడ్డంకి వచ్చిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. తాను ప్రెస్ మీట్ పెట్టి నిలదీసిన తరవాతే మంత్రులు హెలికాప్టర్ వేసుకుని అక్కడికి పరిగెత్తారని తెలిపారు. రేపే మోటార్లు నడుపుతామని మంత్రులు ఒకరిని మించి ఒకరు ఉపన్యాసాలు దంచారని, కానీ ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటికీ 10 మోటార్లు కూడా స్టార్ట్ కాలేదని ఎద్దేవా చేశారు. మంత్రులు వెళ్లిన రోజు ఏడు మోటార్లు నడిస్తే, తెల్లారేసరికి అవి ఐదుకి పడిపోయాయని, కాంగ్రెస్ మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప చేతల్లో శూన్యమని అన్నారు.



## మంగళగిరిలో నారా లోకేశ్ 7.30 గంటల
# నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

- మంగళగిరిలో 1331 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- 'మన ఇల్లు – మన లోకేశ్' కార్యక్రమానికి శ్రీకారం
- సుమారు 7.30 గంటల పాటు నిలబడే పట్టాలు అందించిన మంత్రి లోకేశ్
- లబ్ధిదారులకు పట్టాతో పాటు నూతన వస్త్రాలు బహూకరణ

మంగళగిరి, ఆశ్వి అప్డేట్స్

మంగళగిరి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమం మంగళగిరిలో ఓ పండుగలా జరిగింది. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా తొలిరోజు 1331 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను అందజేశారు.

మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన పట్టాల పంపిణీ సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగింది. లబ్ధిదారుల 'పట్టా'భిషేకం అనదగ్గ ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ దాదాపు ఏడున్నర గంటల పాటు నిలబడే ఉండడం విశేషం. ప్రతి లబ్ధిదారుడికి ఆయనే స్వయంగా పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు.
పట్టా పత్రాలతో పాటు లబ్ధిదారులందరికీ నూతన వస్త్రాలను కూడా మంత్రి లోకేశ్ బహూకరించారు. సుదీర్ఘ సమయం పాటు ఒకేచోట నిలబడి ఓపికగా పట్టాలు పంపిణీ చేయడంపై కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు, ప్రజలు ప్రశంసలు తెలిపారు.

# షూటింగ్ స్పాట్‌లో హీరో బాలకృష్ణకు స్వల్ప గాయం

మొదటిపేజీ తరువాయి

ఎంటర్టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసరాల్లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. చిత్రీకరణ సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడిపోయారు. ఈ క్రమంలో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది. ప్రమాదాన్ని గమనించిన చిత్ర యూనిట్ సభ్యులు వెంటనే షూటింగ్‌ను నిలిపివేసి, ఆయనను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

**ఆందోళన అవసరం లేదన్న వైద్యులు..**

ఆసుపత్రిలో వైద్యులు బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించి, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. గాయం స్వల్పమైనదేనని, కంగారు పడాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. 'వీరసింహారెడ్డి' లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత బాలకృష్ణ గోపీచంద్ మలినేని కాంబినేషన్లో వస్తున్న రెండవ చిత్రం ఇది. శరవేగంగా జరుపుకుంటున్న ఈ కాకినాడ షెడ్యూల్లో భారీ యాక్షన్ సీక్వెన్స్లు చిత్రీకరిస్తున్న సమయంలో ఈ అనుకోని ఘటన జరిగింది. బాలకృష్ణకు గాయమైందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయన త్వరగా కోలుకుని, తిరిగి షూటింగ్‌లో పాల్గొనాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, త్వరలోనే డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని సమాచారం.

# దేవాదులకు ప్రథమ ప్రాధాన్యం..

- తాగునీరు, పశుగ్రాస కొరత లేకుండా ప్రత్యేక చర్యలు
- ఎల్‌నీనో ముప్పు – అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం!
- వర్షా భావ పరిస్థితులపై మంత్రులు పొంగులేటి, పొన్నం సమీక్ష
- ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులు – వరంగల్‌కు ఐఏఎస్ దేవసేన
- వరి, పత్తి స్థానంలో ప్రత్యామ్నాయ పంటలు వేయాలని రైతులకు పిలుపు
- దేవాదుల మోటార్లకు 24 గంటల రిపేర్ గడువు – తాగునీటికే తొలి ప్రాధాన్యం!
- ఆందోళన వద్దు, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి పొంగులేటి




హనుమకొండ, ఆశ్వి అప్డేట్స్

రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు.
సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.
ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజకీయ నాటకాలు వద్దు

- కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- పార్లమెంటులో చర్చించకుండా రాజకీయం చేస్తున్నారని మండిపాటు
- వరుస ఎన్నికల్లో ఓడినా కాంగ్రెస్ తీరు మారడం లేదని వ్యాఖ్య
- బాధ్యతాయుత ప్రతిపక్షం కావాలి కానీ, నిరంతరం ఆందోళన చేసేది కాదంటూ హితవు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటు సమావేశాల వేళ సభలో చర్చల్లో పాల్గొనకుండా, ప్రధానమంత్రి నివాసం వెలుపల నిరసనల పేరుతో రాజకీయ నాటకాలకు తెరలేపడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల బాధ్యత పార్లమెంటులో ప్రశ్నలు అడగటం, చర్చలు జరపడమే తప్ప, సభా కార్యకలాపాలకు విఘాతం కలిగించడం కాదని ఆయన హితవు పలికారు. సభలో చర్చకు ఆస్కారం లేకుండా పదేపదే అంతరాయం కలిగిస్తూ, వాయిదాలకు కారణమవుతున్న కాంగ్రెస్, బయటకు వచ్చి ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ నాటకాలాడుతోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇది బాధ్యతాయుతమైన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదని, ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచే కుట్ర అని ఆయన ధ్వజమెత్తారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన కాంగ్రెస్ పార్టీ, నేడు ప్రజాస్వామ్యం విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సోం, పుదుచ్చేరి వంటి అనేక రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను తిరస్కరించారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఆ పార్టీ ప్రజాసేవ కంటే రాజకీయ అవకాశవాదానికే పెద్దపీట వేస్తుందని, ప్రజలు ఇప్పటికే వారి నిజస్వరూపాన్ని గుర్తించారని ఆయన పేర్కొన్నారు. నిరసనలో భాగంగా కాంగ్రెస్ నేతలు ప్రతీకాత్మకంగా చేతులకు సంకెళ్లు వేసుకోవడంపై ఆయన ఎద్దేవా చేస్తూ, ఆ పార్టీ రాజకీయ ఆకాంక్షలకు భారత ప్రజలు ఎప్పుడో సంకెళ్లు వేశారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు నిజంగా వాదనలు వినిపించాలనే చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.



దేశానికి బాధ్యతాయుతమైన ప్రతిపక్షం అవసరమే కానీ, నిరంతరం గందరగోళం సృష్టించే ప్రతిపక్షం కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# పగటి పూట సోలార్‌తో తగ్గనున్న ఆర్థిక భారం

- వ్యవసాయం, తాగునీరు, విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా తెలంగాణ ప్రభుత్వ కార్యాచరణ.
- పగటి పూట సౌర విద్యుత్ వినియోగంతో విద్యుత్ ఖర్చులకు బ్రేక్.
- వర్షా కాలంలోనూ వేసవి స్థాయి పవర్ వినియోగం.. పక్కాగా ఎనర్జీ మేనేజ్‌మెంట్.
- తక్కువ నీటితో పండే పంటల వైపే మొగ్గు చూపాలని రైతులకు సూచన.
- ఎల్ నినో పరిస్థితులపై త్వరలో జిల్లా స్థాయిలోనూ చైతన్య సదస్సులు.

తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్

:

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం పక్కా ప్రణాళికలు రూపొందిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు



కు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నినోపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం సొంతంగా సరైన ప్రణాళికలు వేసుకోగలుగుతుందన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో జరిగే ఉష్ణోగ్రతల మార్పులు తెలంగాణలోని చెరువులు, వాగులు, గ్రామాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో శాస్త్రవేత్తల ద్వారా విశ్లేషింపజేసి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, సాగునీటితో పాటు పశువులు, పక్షులు, అడవి జంతువుల నీటి, ఆహార అవసరాలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు నిపుణుల సూచనల మేరకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సమాచారాన్ని ప్రత్యక్ష ప్రసారాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడంలో టీవీ ఛానెళ్లు తమ సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాయని అభినందించారు. మన జీవన విధానంలో విద్యుత్ ప్రధానమైనదని, ఎల్ నినో వల్ల పెరిగిన డిమాండ్‌ను తట్టుకునేందుకు ప్రభుత్వం ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తోందన్నారు. పగటి పూట విరివిగా, తక్కువ ధరకు లభించే సౌర విద్యుత్‌ను (సోలార్ పవర్) గరిష్టంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలపై, ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. సోలార్ సమయాన్ని సమర్థవంతంగా వాడుకుంటూ, తదుపరి అవసరాలకు థర్మల్ విద్యుత్‌ను క్రమబద్ధంగా వినియోగించడం ద్వారా గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతున్నామన్నారు.

**వర్షా కాలంలో వేసవి కాలం స్థాయి విద్యుత్‌డిమాండ్ :**

ఉష్ణోగ్రతలు పెరగడంతో పగలు, రాత్రి అనే తేడా లేక ఫ్యాన్లు, ఏసీలు, లైట్లు, బోర్‌వెల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల వాడకం భారీగా పెరిగిందన్నారు. సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉంటుంది, కానీ ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో ప్రస్తుత డిమాండ్ ఏప్రిల్ నాటి గరిష్ట స్థాయికి చేరుకుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సీజన్లకు అనుగుణంగా విద్యుత్ వినియోగంలో మార్పులు వస్తున్నాయని, పెరిగిన అవసరాలకు తగ్గట్టుగా ఎనర్జీ ప్లానింగ్ రూపొందించుకోవడంలో తెలంగాణ ముందుంటుందని తెలిపారు. ఏసీలు, ఫ్యాన్లు, మోటార్ల వాడకంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.
సమాజంలో చైతన్యం తీసుకురావడానికి విషయ నిపుణులను ఆహ్వానించి ఈ సదస్సును ఏర్పాటు చేసిన ప్లానింగ్ శాఖను ఉప ముఖ్యమంత్రి అభినందించారు. ఇటువంటి అవగాహన సదస్సులను భవిష్యత్తులో జిల్లాల వారీగా కూడా నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేస్తూ పూర్తి స్థాయి చైతన్యం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పాలనాధికారులు తమ విధులతో పాటు సమాజానికి మేలు చేసే ఇటువంటి అంశాలలో ప్రజలను చైతన్యవంతం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఐఏఎస్ అధికారులు దివ్య దేవరాజన్, గోపి, జితేష్ వి పాటిల్ ప్లానింగ్ డైరెక్టర్ రూఫొస్ దత్తం తదితరులు పాల్గొన్నారు.

# 'మోదీ నివాసం' వద్ద కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్!

- ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా.. రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
- ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత

**ఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్**

నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీ చార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది.

నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు.

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.







## డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్ పై సీఎం చంద్రబాబు సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు

**అమరావతి, ఆశ్వి అప్డేట్స్**

రాష్ట్రంలోని డాక్యుమెంట్ రైటర్లు చేపట్టిన పెన్ డౌన్ ఆందోళనపై సీఎం నారా చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ జరుగుతుందని వస్తున్న వార్తలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వంపై జరుగుతున్న ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదన్నారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలోనే ఈ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు కూడా పనిచేస్తాయని తెలిపారు. ఫలితంగా రిజిస్ట్రేషన్ సేవల్ని మరింత ఈజీగా పొందవచ్చని, మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుందని వివరించారు. ఈ నూతన విధానం వల్ల డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారి ఉపాధికి ఎలాంటి ఇబ్బంది లేకుండా.. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. అలాగే.. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్ని ప్రైవేటీకరిస్తున్నారన్న ప్రచారంలోనూ ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ కేంద్రాలు పూర్తిగా ప్రజలకు నిరంతర, పారదర్శక సేవలు అందించడం కోసమేనని ఆయన వివరించారు. ప్రజల సౌకర్యార్థం ఈ సేవలను మరింత సులభతరం చేసేందుకు సాంకేతిక సంస్కరణలు చేపడుతున్నామని, వ్యవస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు.






# కొడంగల్ ప్రాజెక్టు భూసేకరణ వేగవంతం చేయండి

- మక్తల్–నారాయణపేట్–కొడంగల్ ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి
- భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశం
- ఏ తండాకూ రోడ్డు లేదనే పరిస్థితి ఉండొద్దు – ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలి
- కొత్త పంచాయతీ భవనాల పర్యవేక్షణకు ప్రత్యేకంగా 'ఈఈ' (EE) స్థాయి అధికారి నియామకం
- ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

**హైదరాబాద్, జూలై 21 (ఆశ్వి అప్డేట్స్):**

మక్తల్-నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు (MNKLIS) భూసేకరణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులతో పాటు ఎత్తిపోతల ప్రాజెక్టు పురోగతిపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో అధికారులు ప్రాజెక్టు పురోగతిపై ప్రజెంటేషన్ ఇవ్వగా, భూసేకరణకు అవసరమైన సర్వేయర్ల నియామకం, బడ్జెట్ మంజూరుకు ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, వెంటనే టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కొడంగల్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (KADA) పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను శాఖల వారీగా సమీక్షించిన సీఎం, ప్రతి పనిపై పురోగతిని తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.

నియోజకవర్గంలోని గ్రామాలకు మెరుగైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. "నియోజకవర్గంలో ఏ తండాకు రోడ్డు లేదనే పరిస్థితి ఉండకూడదు. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండేలా చర్యలు తీసుకోవాలి" అని స్పష్టం చేశారు.

కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు పంచాయతీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఈఈ స్థాయి అధికారిని నియమించి పనులను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలో కొడంగల్ అభివృద్ధి, తాగునీటి భద్రత, రహదారుల నిర్మాణం, గ్రామీణ మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం స్పష్టం చేశారు.





# హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి

- హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌పై సీఎం రేవంత్ ఫైర్.. పనుల్లో జాప్యంపై అధికారులకు హెచ్చరిక!
- నెలకు ఒకసారి సైట్‌లోనే బస చేస్తా.. ఎడ్యుకేషన్ హబ్ పనుల వేగంపై సీఎం సమీక్ష
- పనుల్లో అలసత్వం వహిస్తే సస్పెన్షన్ తప్పదు.. వికారాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- వచ్చే వారంలోగా బాధితులకు ప్లాట్లు ఇవ్వాల్సిందే.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం

**వికారాబాద్, జూలై 21 (ఆశ్వి అప్డేట్స్):**

వికారాబాద్ జిల్లా హకీంపేటలో నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రతి నెలా పనుల పురోగతిని స్వయంగా సమీక్షిస్తానని, అవసరమైతే ఒక రోజు సైట్‌లోనే బస చేసి పనులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు.

హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ముఖ్యమంత్రి, ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాలలతో పాటు విద్యార్థి హాస్టళ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ ప్రాంత అభివృద్ధి ప్రణాళికలపై కూడా సమగ్రంగా ఆరా తీశారు.

నిర్మాణ పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన నెలవారీ పురోగతి నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యానికి తావు లేకుండా నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పనుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించిన ముఖ్యమంత్రి, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను అవసరమైతే సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడవద్దని ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యం జరగడంపై కూడా ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా అర్హులైన లబ్ధిదారులకు ప్లాట్ల పట్టాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు, భూసేకరణ, రైతుల పునరావాసం తదితర అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.


# రైతులను పట్టించుకోని రేవంత్ సర్కార్

- రైతులు చనిపోతున్నా పట్టించుకోని రేవంత్ ప్రభుత్వం: కేటీఆర్ మండిపాటు
- హామీలతో వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్: రైతు సదస్సులో బీఆర్ఎస్ కేటీఆర్ విమర్శలు
- బాధితులకు భరోసా: చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 5 లక్షల చెక్కులు అందించిన కేటీఆర్
- వరంగల్ రైతు డిక్లరేషన్ ఏమైంది?: రుణమాఫీ, ఉద్యోగాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్
- అధికారుల పక్షపాతంపై నిరసన: మంచిర్యాల ఎమ్మెల్యే, కలెక్టర్ తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం



**లక్షెట్టిపేట , ఆశ్వి అప్డేట్స్**

రైతులు సచ్చిపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని అంకత్ పల్లిలో వాసవి గార్డెన్స్ లో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో రకాల అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నేడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందన్నారు. వర్షానికి గోడ కూలీ మరణిస్తే నేటికీ ఆ రైతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎలాంటి సహాయం అందలేదని విమర్శించారు. చివరికి కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు భీమా ద్వారా మాత్రమే ఒక రైతు కుటుంబానికే రూ. 5 లక్షలు సాయం అందిందన్నారు. మిగిలిన రైతులకు ప్రభుత్వం ఎలాంటి సాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సచ్చిపోతున్న రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు చెప్పిన వరంగల్ రైతు డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. 32 నెలలు దాటిన కూడా ప్రభుత్వం ఇప్పటికీ రైతులకు న్యాయం చేయడం లేదని, కాళేశ్వరం రిపేర్ పనులు ఎందుకు చేయడం లేదని ఆరోపించారు. ప్రాజెక్టులను బాంబులతో పేల్చిన వారికి సాగునీటి విలువ ఎలా తెలుస్తుందని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని, రైతులను మోసం చేశారని గుర్తు చేశారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఏమైనాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు రేవంత్ దొరికితే ఉరికిచ్చి కొడుతారన్నారు. నిరుద్యోగులను ఎండ్రిన్ తాగుమని ఎలా అంటావ్ రేవంత్ అని మండిపడ్డారు. మాది ఏ జాతి అని ప్రశ్నించే రేవంత్ కు మేమిచ్చే సమాధానం ఒక్కటే, మాది తెలంగాణను ప్రేమించే జాతి అని స్పష్టం చేశారు. ఉద్యమ కారుల పై తుపాకీ ఎక్కుపెట్టిన జాతి నీది రేవంత్ దేనని, ఎమ్మెల్యేను నోట్లతో కొనే జాతి రేవంత్ దని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రజలకు వివరించారు. రైతుల పంటలను కొనుగోలు చేయరు, గిట్టుబాటు ధర ఇవ్వరు, యూరియా కోసం అనేక కష్టాలను రైతులు పడటమే కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు అని ప్రసంగించారు. అంతకుముందు వర్షానికి అకాల మరణం చెందిన దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలకు చెందిన రైతు కుటుంబాలకు పార్టీ తరపున ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వేధింపులను సహించేది లేదని, ఎమ్మెల్యే తన పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రజాసంక్షేమం గురించి మీ ముఖ్యమంత్రిని అడిగి అభివృద్ధి పనులు చేయండి, అనవసరంగా మా పార్టీ నాయకుల, కార్యకర్తల జోలికి రావద్దని కేటీఆర్ హెచ్చరించారు. అంతకు ముందు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రతిపక్ష నాయకుల పై కక్ష సాధింపు పనులు మానుకుని, రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే చెప్పినట్టు వినడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని పక్షపాతం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మరణిస్తే ఎమ్మెల్యే మాటలు విని కలెక్టర్ సంఘటనా స్థలానికి రాలేదని ఆరోపించారు. అంతకుముందు పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ సీఎం అవుతారని, ప్రజలకు మేలుజరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవలక్ష్మీ, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, సుంకే రవి, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, మాజీ ఫిల్మ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, రాష్ట్ర నాయకులు విజిత్ రావు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






## పోక్సో కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష.. బాధితులకు రూ.1.50 లక్షల పరిహారం

**హైదరాబాద్, జూలై 21 (ఆశ్వి):**

బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన పోక్సో కేసులో ఇద్దరు నిందితులకు ఎల్బీనగర్ ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టు జైలు శిక్షలు విధించింది. ప్రధాన నిందితుడు సంపంగి చంద్రశేఖర్‌కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించగా, మరో నిందితుడు బొల్లిపాక మధుకు 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.7 వేల జరిమానా విధించింది. అదేవిధంగా బాధితులకు రూ.1.50 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చేసిన బాలాపూర్ పోలీసుల కృషిని ఉన్నతాధికారులు అభినందించారు.



## గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ శ్రీనివాసరావు.. సేవాభావంతో ప్రజల విశ్వాసం పొందాలని సూచన

**గద్వాల్, జూలై 21 (ఆశ్వి):**

జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మంగళవారం గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ, నూతన కాంపౌండ్ వాల్, పార్కింగ్ షెడ్‌ను ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు, సిబ్బంది కిట్, బ్యారెక్స్, స్టేషన్ పరిశుభ్రత, స్వాధీనం చేసుకున్న వాహనాలు తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి పగలు, రాత్రి బీట్‌ల ద్వారా నిఘా పెంచాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, సస్పెక్ట్‌ల కదలికలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ పరికరాలు, సీసీటీఎన్ఎస్2.0, టీఎస్‌కాప్, ఈసాక్ష్య, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ అప్లికేషన్లు, బాడీవోర్న్ కెమెరాలు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి నేరాల నియంత్రణ, దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించాలని, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు.

విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజూ వాహనాల తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని, డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, ప్రజల పట్ల సేవాభావం, బాధ్యత, చట్ట పరిరక్షణ సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించేలా నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, విధులు-వ్యక్తిగత జీవితంలో సమతుల్యత పాటించాలని సూచించారు.

తనిఖీ అనంతరం ఎస్పీ, డీఎస్పీతో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.



## పర్యాటకులు అధికారుల సూచనలు పాటించాలి: సీతక్క

**ములుగు, ఆశ్వి అప్డేట్స్**

ములుగు జిల్లాకు వచ్చే పర్యాటకులు అధికారుల సూచనలు ఖచ్చితంగా పాటించాలని మంత్రి సీతక్క అన్నారు. పోలీసులు, అటవీ శాఖ నిర్దేశించిన పరిమితులు దాటి లోతైన అడవుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేశారు. హెచ్చరిక బోర్డులు పెట్టినప్పటికీ నిషేధిత ప్రాంతాలకు వెళ్లి ఇప్పటికే ఇద్దరు యువకులు మృతి చెందడం తీవ్ర విచారం కలిగించిందన్నారు. ప్రమాదకర కొండలు, వాగుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. పర్యాటకుల భద్రత కోసం జలపాతాల వద్ద బారికేడ్లు, రక్షణ ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. సురక్షిత ప్రాంతాల నుంచే ప్రకృతి అందాలు, మేడారం, రామప్ప ఆలయాలను సందర్శించి వెళ్లాలని సూచించారు. ఇదిలా ఉంటే వర్షాకాలం కావడంతో ములుగు



జిల్లాకు పర్యాటకులు భారీ తరలివస్తున్నారు. జిల్లాలోని, చుట్టుపక్కల జిల్లాల నుండి పర్యాటకులు వస్తుండగా కొందరు నిషేధిత ప్రాంతాల్లోకి వెళుతూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటారు. జలపాతాలను చూసేందుకు ప్రాణాలను రిస్క్ లో పెడుతున్నారు. ప్రతిఏడాది ప్రమాదాలు జరుగుతున్నా జలపాతాల వద్ద ప్రమాదకరంగా ఫోటోలు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క వీడియో ద్వారా పర్యాటకులకు పలుసూచనలు చేశారు.

## కరుడుగట్టిన రౌడీ షీటర్‌పై పీడీ చట్టం అమలు.. చిలకలగూడ పోలీసుల చర్య

**హైదరాబాద్, జూలై 21 (ఆశ్వి):**

ప్రజా శాంతిభద్రతలకు ముప్పుగా మారిన కరుడుగట్టిన రౌడీ షీటర్ బొజ్జ భాగ్యరాజ్‌పై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం కింద హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.
ఈ ఉత్తర్వులను మంగళవారం చిలకలగూడ పోలీసులు అమలు చేశారు.
పోలీసుల వివరాల ప్రకారం, చిలకలగూడకు చెందిన బొజ్జ భాగ్యరాజ్‌పై హైదరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ల పరిధిలో మొత్తం 15 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. హత్యాయత్నం, అల్లర్లు, తీవ్ర గాయాలు కలిగించడం, బెదిరింపులు, పోక్సో చట్టం కింద కేసులు సహా పలు తీవ్రమైన నేరాలు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే అతనిపై గతంలో రెండుసార్లు పీడీ చట్టం అమలు చేసినప్పటికీ, అలాగే బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 128 కింద బైండోవర్ చేసినా నిబంధనలను ఉల్లంఘిస్తూ మళ్లీ నేరాలకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇటీవల చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మూడు హత్యాయత్నం కేసుల్లోనూ అతడు నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు.
రెండు కేసుల్లో బెయిల్ పొందిన తర్వాత కూడా షరతులను ఉల్లంఘించినట్లు వెల్లడించారు.
ఈ నేపథ్యంలో అతని నిరంతర నేరపూరిత కార్యకలాపాలు, ప్రజా శాంతిభద్రతలకు ముప్పుగా మారిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు



జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు న్యాయస్థాన రిమాండ్‌లో ఉన్నాడు. పీడీ ప్రతిపాదనను చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ బృందం సిద్ధం చేయగా, ఏసీపీ కె. శశాంక్ రెడ్డి పర్యవేక్షణలో, అదనపు డీసీపీ జె. నర్సయ్య ఆధ్వర్యంలో ఉత్తర్వులను అమలు చేసినట్లు వెల్లడించారు.
ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీ పోలీసులు నగరంలో నేరాల నియంత్రణకు "జీరో టాలరెన్స్" విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని పేర్కొంటూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే సంఘటనలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నిత్య నేరస్థులు, రౌడీ షీటర్లు, సంఘవిద్రోహ శక్తులపై పీడీ చట్టంతో పాటు కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.





## మోడిఫైడ్ బుల్లెట్ సైలెన్సర్లపై పోలీసుల ఉక్కుపాదం.. రోడ్డు రోలర్‌తో 40 సైలెన్సర్లు ధ్వంసం

**కోదాడ, జూలై 21 (ఆశ్వి):**

నిబంధనలకు విరుద్ధంగా బుల్లెట్ బైక్‌లకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనదారులపై కోదాడ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుర్తించిన 40 మోడిఫైడ్ సైలెన్సర్లను మంగళవారం రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక శబ్దాలతో వాహనాలు నడిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.
వృద్ధులు, రోగులు, చిన్నారులకు ఇబ్బంది కలిగించేలా శబ్ద కాలుష్యం సృష్టించడం చట్టవిరుద్ధమని పేర్కొన్న ఎస్పీ, ద్విచక్ర వాహనదారులు కంపెనీ అమర్చిన అసలు సైలెన్సర్లనే ఉపయోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.
పట్టణంలో శాంతిభద్రతలకు, ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, యువత ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్పీ నరసింహ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## చింతలపాలెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ నరసింహ.. సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

**చింతలపాలెం, జూలై 21 (ఆశ్వి):**

సూర్యాపేట జిల్లా పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ మంగళవారం చింతలపాలెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది గౌరవ వందనంతో ఆయనకు స్వాగతం పలికారు.
ఎస్పీ పోలీసు సిబ్బంది కవాతు, యూనిఫాం, పరికరాలను పరిశీలించి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, రికార్డులు, పోలీసు సేవలను సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు, కేసుల దర్యాప్తును పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.
ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దులో ఉన్న మల్లారెడ్డిగూడెం ప్రాంతం భౌగోళికంగా అత్యంత కీలకమైనదని ఎస్పీ పేర్కొన్నారు.
ఈ ప్రాంతంలో పరిశ్రమలు, మైనింగ్ కార్యకలాపాలు, పులిచింతల ప్రాజెక్టు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఉండటంతో సరిహద్దు వెంట నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, ఇతర నేర కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు. గత మూడేళ్ల నేరాల సరళిని విశ్లేషించి వాటి నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, సైబర్ నేరాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. మల్లారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు నూతన భవనం నిర్మాణం త్వరలో పూర్తవుతుందని, అనంతరం అక్కడి నుంచే ప్రజలకు మరింత వేగవంతమైన



సేవలు అందిస్తామని ఎస్పీ వెల్లడించారు. ఈ తనిఖీలో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మగ్దూమ్ అలీ, ఎస్ఐ పరమేష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రాంబాబు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తుపై పోలీసులకు ఎస్పీ స్నేహ మెహ్రా బ్రీఫింగ్

**వికారాబాద్, జూలై 21 (ఆశ్వి):**

రాష్ట్ర ముఖ్యమంత్రి కొడంగల్ నియోజకవర్గ పర్యటన సందర్భంగా బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ హకీంపేట్‌లో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ పాయింట్‌లో ప్రత్యేకంగా సూచనలు చేశారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రాధాన్యమైన కార్యక్రమం కావడంతో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి అప్రమత్తతతో, క్రమశిక్షణతో నిర్వర్తించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా పరస్పర సమన్వయంతో పనిచేస్తూ భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.
పర్యటన మార్గంలో నిరంతర నిఘా కొనసాగించాలని, ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.
ఈ బ్రీఫింగ్‌లో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఏపీలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అమరావతి, జూలై 21 (ఆశ్వి అప్డేట్స్):**

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, భారత వాతావరణ శాఖ (IMD) వెల్లడించాయి. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశముండటంతో పాటు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు వ్యవసాయ పనుల సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల కింద ఆశ్రయం పొందరాదని అధికారులు హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారుల సూచనలను పాటించాలని, అవసరమైతే విపత్తు నిర్వహణ విభాగం అందించే హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# రాహుల్ గాంధీ అరెస్టు అప్రజా-స్వామికమని కాంగ్రెస్ విమర్శ

**మహబూబ్‌నగర్, జూలై 21 (ఆశ్వి):**

జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగినట్లు పేర్కొన్న లాఠీచార్జీకి నిరసనగా ప్రధాన మంత్రి నివాసం సమీపంలో శాంతియుతంగా నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి విమర్శించారు. జంతర్ మంతర్ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తున్న అవకతవకలు, పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొన్న విద్యార్థుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, ఈ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించి వాస్తవాలను దేశ ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. దేశ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడే చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించదని, ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన తెలిపే హక్కును హరించే చర్యలు సమంజసం కావని మిథున్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలను వీడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ అగ్రనేతలు అరెస్ట్.. అర్ధరాత్రి భారీ నిరసనకు దిగిన జగ్గారెడ్డి

**ఆశ్వి అప్డేట్స్**

ఢిల్లీలోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీయడం, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ప్రియాంకా గాంధీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడం దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ వేడిని రగిల్చింది. ఈ వార్త తెలియగానే తెలంగాణలోని పలు జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు రోడ్లపైకి వచ్చి తీవ్ర నిరసనలు తెలిపాయి. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద 65వ నంబరు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి, పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో పోతిరెడ్డిపల్లి జంక్షన్ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనను అడ్డుకోవడానికి యత్నించిన పోలీసు వాహనాలను కార్యకర్తలు చుట్టుముట్టి అడ్డుకోవడంతో కొద్దిసేపు పరిస్థితులు చేతులు దాటేలా కనిపించాయి. జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో కిలోమీటర్ల మేర తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అదనపు బలగాలను రప్పించి పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం మోడీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని జగ్గారెడ్డి ఈ సందర్భంగా మండిపడ్డారు.







# రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నకిరేకల్‌లో కాంగ్రెస్ నిరసన

**నకిరేకల్, జూలై 21 (ఆశ్వి):**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని మాట్లాడుతూ, రాజకీయ కక్షసాధింపు ధోరణిలో ప్రతిపక్ష నేతలపై చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. ప్రజల సమస్యలను ప్రస్తావిస్తున్న రాహుల్ గాంధీపై చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యతిరేకిస్తుందని, రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 21 (ఆశ్వి):**

రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2026 ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారమ్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించినట్లయితే హార్డ్ కాపీల కోసం బీఎల్ఓలు వారిని ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారమ్ సమర్పణకు ఆధార్ కార్డు తప్పనిసరి అని చెప్పకూడదని స్పష్టం చేశారు.



ఓటర్లకు అవసరమైన సహాయాన్ని అందించి, వారి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీవీఐపీ, వీఐపీ ఓటర్ల పేర్లు ఓటరు జాబితాల్లో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను నవీకరించాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రాజకీయ పార్టీలతో నిర్వహించే సమావేశాల్లో పారదర్శకత పాటించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాలు, పురోగతి తక్కువగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఈ వారాంతానికి ప్రతి జిల్లాలో ఎన్యుమరేషన్ ప్రక్రియ 90 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు. నోమ్యాపింగ్ కేటగిరీలో ఉన్న ఓటర్లను పూర్తిస్థాయిలో ధృవీకరించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్ఐఆర్2026 కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని స్థాయిల ఎన్నికల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి జి.ఎస్. చారి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ పోలీసు శాఖ ఆధునీకరణపై డీజీపీ సి.వి. ఆనంద్ సమీక్ష..

# కీలక అంశాలపై స్టాఫ్ ఆఫీసర్ల సమావేశం

**హైదరాబాద్, జూలై 21 (ఆశ్వి):**

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా చేపట్టాల్సిన విధానపరమైన, పరిపాలనా, సాంకేతిక అంశాలపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ అధ్యక్షతన స్టాఫ్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఆర్సీ (SRC) నివేదిక అమలు, మావోయిస్టు ముప్పు పేరుతో అవసరానికి మించి కల్పించిన భద్రతను సమీక్షించి, దాదాపు 400 మంది పోలీసు సిబ్బంది, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావడం, శాఖలోని సిబ్బంది, వాహనాల ఆడిట్ తదితర అంశాలపై చర్చించారు. అదేవిధంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ యూనిట్లను ఒకే క్యాంపస్ నుంచి నిర్వహించే ప్రతిపాదన, తెలంగాణ పోలీసు మాన్యువల్ తుది రూపకల్పన, ఐపీఎస్ అధికారుల యూనిఫాంలో క్రాస్ బెల్ట్‌లు, లాఠీలు వంటి సంప్రదాయ అంశాల ప్రస్తుత అవసరంపై సమీక్షించారు. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బంది సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు, విజిలెన్స్, ఆహార కల్తీ నిరోధం, డ్రగ్ కంట్రోల్ వంటి రంగాల్లో కొత్త ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు, ట్రాఫిక్ అండ్ రోడ్డు భద్రత బ్యూరో ఏర్పాటుపై కూడా సమావేశంలో చర్చించారు. సాంకేతికతకు



ప్రాధాన్యం ఇస్తూ టెక్నాలజీ అండ్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగం ఆధునీకరణ, సీసీటీఎన్ఎస్ 3.0, టీజీకాప్ 3.0, హాక్ఐ 3.0 ప్రాజెక్టుల పురోగతిని డీజీపీ సమీక్షించారు. సమావేశంలో అధికారులు చేసిన సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి, తెలంగాణ పోలీసు శాఖ భవిష్యత్ విధానాల రూపకల్పనలో వాటిని పరిగణనలోకి తీసుకుంటామని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు.

## హైకోర్టు ఆదేశాలతో రైతుకు ఐదేళ్ల తర్వాత స్టాంప్ డ్యూటీ రిఫండ్..

# రాష్ట్రంలో ఇంకా 26,740 దరఖాస్తులు పెండింగ్

**హైదరాబాద్, జూలై 21 (ఆశ్వి):**

ధరణి (ప్రస్తుతం భూ భారతి) పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ స్లాట్‌లను రద్దు చేసుకున్న వారికి స్టాంప్ డ్యూటీ రిఫండ్ల చెల్లింపులో తీవ్ర జాప్యం కొనసాగుతున్నట్లు అధికారిక వివరాలు వెల్లడిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఓ రైతుకు రావాల్సిన రూ.1,38,921 స్టాంప్ డ్యూటీ రిఫండ్ దాదాపు ఐదేళ్ల తర్వాత, హైకోర్టు ఆదేశాల అనంతరం చెల్లించబడింది.

2021 జూలైలో ధరణి పోర్టల్‌లో బుక్ చేసుకున్న రిజిస్ట్రేషన్ స్లాట్‌ను రైతు రద్దు చేసుకున్నప్పటికీ రిఫండ్ అందలేదు. అనంతరం ఆయన హైకోర్టును ఆశ్రయించగా నాలుగు వారాల్లో రిఫండ్ చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఆదేశాలు అమలు కాకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలై, చివరకు 2026 జూలై 17న ప్రభుత్వం రిఫండ్ విడుదల చేసింది.

ఇదిలా ఉండగా, తెలంగాణ అసెంబ్లీలో రెవెన్యూ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ధరణి పోర్టల్‌లో రద్దు చేసిన స్లాట్‌లకు సంబంధించి మొత్తం 31,314 రిఫండ్ దరఖాస్తులు అందాయి.



వాటిలో కేవలం 4,574 మాత్రమే పరిష్కరించగా, ఇంకా 26,740 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు రూ.12.97 కోట్లు చెల్లించగా, మరో రూ.87.60 కోట్ల స్టాంప్ డ్యూటీ రిఫండ్లు బకాయిగా ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**జిల్లాల వారీగా భారీ పెండింగ్**

రిఫండ్ దరఖాస్తుల పరిష్కారంలో పలు జిల్లాల్లో పురోగతి చాలా మందగించింది. రంగారెడ్డి జిల్లాలో 3,961 దరఖాస్తుల్లో కేవలం మూడు మాత్రమే పరిష్కరించగా, 3,958 పెండింగ్‌లో ఉన్నాయి. సంగారెడ్డిలో 3,001లో 2,993, నల్గొండలో 1,954లో 1,950, వికారాబాద్‌లో 1,844లో 1,839, యాదాద్రి భువనగిరిలో 1,204లో 1,095 దరఖాస్తులు ఇంకా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో 85 శాతానికి పైగా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.


**ప్రత్యేక బడ్జెట్ లేదని ప్రభుత్వ సమాధానం**

రిఫండ్‌ల చెల్లింపుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించారా అనే ప్రశ్నకు ప్రభుత్వం అసెంబ్లీలో "Not Applicable" అని సమాధానం ఇచ్చింది. రిఫండ్ల జాప్యానికి గల కారణాలపై స్పష్టమైన వివరణ ఇవ్వకుండా, దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని మాత్రమే పేర్కొంది.

**బాధితుల్లో ఆందోళన**

హైకోర్టును ఆశ్రయించిన తర్వాతే ఒక రైతుకు రిఫండ్ అందిన నేపథ్యంలో, కోర్టుకు వెళ్లలేని వేలాది మంది దరఖాస్తుదారుల పరిస్థితిపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న రిఫండ్లను ప్రభుత్వం ఎప్పుడు పూర్తిగా చెల్లిస్తుందనే అంశంపై బాధితులు స్పష్టత కోరుతున్నారు.

# మేకప్ లేకుండానే అందంగా ఉండటం ఎలా?



ఫేస్ క్రీమ్స్, బ్యూటీ ప్రొడక్ట్స్ వాడకుండానే అందంగా ఉండొచ్చని చెబుతున్నారు బ్యూటీషియన్స్. ఈ టిప్స్ పాటించేయండి మేకప్ లేకపోయినా అందంగా కనిపిస్తారు. ఆడవాళ్లైతే అందంగా కనిపించడంలో ఎక్కడా తగ్గరు. ఎంత ఖరీదైనా సరే బ్యూటీ ప్రొడక్ట్స్ ను వాడుతుంటారు. మేకప్ మాత్రమే మనల్ని అందంగా చేస్తుందని చాలా మంది నమ్ముతారు. కానీ మేకప్ లేకున్నా మీరు అందంగా కనిపిస్తారు. అదికూడా కొన్ని పనులను చేస్తే. అవుకు మేకప్ వేసుకోకున్నా అందంగా కనిపించాలంటే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం పదండి.

### హెల్తీ ఫుడ్

హెల్తీ ఫుడ్ లో మన శరీరానికి కావాల్సిన పోషకాలన్నీ పుష్కలంగా ఉంటాయి. ఇవి కేవలం మన శరీరాన్ని మాత్రమే కాకుండా.. మన చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి కూడా సహాయపడతాయి. ఆరోగ్యకరమైన ఆహారం మన శరీరం లోపలి నుంచి ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా చర్మంపై నేచురల్ గ్లో ని కూడా అందిస్తుంది.

### తగినంత నిద్ర

నిద్ర ఎక్కువ పోయినా మంచిది కాదు. తక్కువ పోయినా మంచిది కాదు. ఇది మీ ముఖంపై నేరుగా ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి మీరు సహజంగా అందంగా కనిపించాలంటే తగినంత నిద్రపోయేలా చూసుకోండి. దీనివల్ల మీరు మేకప్ వేసుకోకున్నా అందంగా కనిపిస్తారు.

### ప్రతిరోజూ వ్యాయామం


వ్యాయామం కేవలం మన శరీరాన్ని మాత్రమే ఫిట్ గా, హెల్తీగా ఉంచుతుంది అనుకుంటే పొరపాటే. మీరు ప్రతిరోజూ యోగా, వ్యాయామం, ధ్యానం, మార్నింగ్ వాక్ చేస్తే మీ శరీరం, మనస్సు, లోపలి నుంచి బయటినుంచి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఒత్తిడి చాలా వరకు తగ్గిపోతుంది. దీంతో మీరు మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. దీంతో మీరు త్వరగా వృద్ధాప్యంలోకి రారు.

### పుష్కలంగా నీరు

మన శరీరానికి తగినంత నీరు చాలా అవసరం. నీరు మన శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంతో పాటుగా శరీరానికి చురుకుదనాన్ని తీసుకొస్తుంది. అలాగే డ్రై స్కిన్, మొటిమలు వంటి చర్మ సంబంధిత సమస్యలను రాకుండా చేస్తుంది.

### శరీరం శుభ్రంగా

అందమైన, మెరిసే చర్మం పొందాలంటే మీరు మీ శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. ఇందుకోసం మీరు ప్రతిరోజూ స్నానం చేయలి. అలాగే ఎప్పటికప్పుడు జుట్టును కడుక్కోవాలి. దీనివల్ల బ్యాక్టీరియా, దురద, అలెర్జీలు మొదలైన సమస్యలు రావు.



**సరైన సైజు దుస్తులు**

మీ శరీరానికి అనుగుణంగా సరిపోయే దుస్తులు ధరించడం వల్ల కూడా మీరు, మీ వ్యక్తిత్వం అద్భుతంగా కనిపిస్తుంది. ఇది కూడా మీరు మేకప్ లేకుండా అందంగా కనిపించడానికి సహాయపడుతుంది. కాబట్టి మీ శరీర తత్వాన్ని బట్టి సరైన దుస్తులు ధరించండి.

**చర్మం, జుట్టు సంరక్షణ ముఖ్యం**

మీరు మేకప్ వేసుకోకున్నా అందంగా కనిపించాలంటే మాత్రం జుట్టు, చర్మం రెండింటికీ అదనపు సంరక్షణ అవసరం. దీని కోసం మీరు చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయాలి.

# ఒత్తిడి సమస్య స్త్రీలలోనే ఎక్కువ



స్త్రీలకు సహనం ఎక్కువ.. ఎటువంటి పరిస్థితులనైనా వాళ్లు తట్టుకోగలరు. ఇటు ఇంటినీ అటు ఉద్యోగజీవితాన్ని రెండింటిని బ్యాలెన్స్ చేసుకోగలరు అని అంతా అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి పురుషుల కంటే స్త్రీలలోనే ఒత్తిడి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తాజాగా కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. "ఎమోషనల్ వెల్‌నెస్ స్టేట్ ఆఫ్ ఎంప్లాయీస్" పేరుతో లేటెస్ట్ రిపోర్టు ప్రకారం.. యువర్‌దోస్ట్ 5వేల కన్నా ఎక్కువ మంది భారతీయ నిపుణులను సర్వే చేసింది. ఒత్తిడికి సంబంధించిన కొన్ని ప్రశ్నలు వేశారు. 5వేల కన్నా ఎక్కువ మంది నుంచి అభిప్రాయాలను సేకరించిన తర్వాత మానసిక ఆరోగ్య ప్లాట్‌ఫారమ్ యువర్‌దోస్ట్ పని ప్రదేశాలలో పురుషుల కన్నా స్త్రీలు ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నట్లు కనుగొన్నారు.

**18 శాతం మహిళల్లో తీవ్ర మానసిక ఒత్తిడి :**

72.2శాతం మంది మహిళలు తాము ఒత్తిడితో బాధపడుతున్నామని చెప్పారు. పురుషులను అదే ప్రశ్న అడిగినప్పుడు.. వారిలో 53.64శాతం మంది అధిక ఒత్తిడి ఫీల్ అవుతున్నట్టు చెప్పారు. పని ప్రదేశాల్లో తాము ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నట్టు స్త్రీలు చెప్పారు. 18శాతం మంది మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాన్ని బ్యాలెన్స్ చేసేందుకు ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. పనికి తగిన గుర్తింపు లేకపోవడం, తక్కువ నైతికత, భయాందోళనలు వంటివి ఉన్నాయి. 9.27శాతం మంది పురుషులతో పోలిస్తే.. 20శాతం మంది మహిళలు ఎల్లప్పుడూ తీవ్ర ఒత్తిడిని కలిగి ఉన్నట్లు నివేదించారు.

**అత్యంత ఒత్తిడికిలోనైన వయస్సు గ్రూపులివే :**

ఉద్యోగుల ఎమోషనల్ వెల్‌నెస్ స్టేట్ నివేదిక ప్రకారం.. 21 ఏళ్ల వయస్సు నుంచి 30 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న ఉద్యోగులు, కార్మికులలో అత్యంత ఒత్తిడికి గురవుతున్నారు. 21 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల 64.42శాతం మంది కార్మికులు అధిక స్థాయి ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు నివేదించారు. 31 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల 59.81శాతం మంది ఉద్యోగులు ఇదే ఫాలో అయ్యారు. తక్కువ ఒత్తిడికి గురైన వయస్సు సమూహం 41 ఏళ్ల నుంచి 50 సంవత్సరాలు. 53.5శాతం మంది ఉద్యోగులు మాత్రమే అధిక స్థాయి కార్యాలయంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు నివేదించారు.

## బంధాలు బలపడాలంటే

# గిఫ్ట్ లు ఇచ్చిపుచ్చుకోండి

గిఫ్ట్ లు ఇచ్చిపుచ్చుకోవడం వల్ల స్నేహబంధం మరింత బలపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎలాంటి బహుమతి ఇవ్వాలా? అని చాలా ఆలోచిస్తాం. వారి అభిరుచికి తగ్గట్లు, అది వారికి ఉపయోగపడేట్లు ఇవ్వాలని అనుకుంటాం. ఎటువంటి బహుమతులు ఇవ్వాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. ఫొటో ఫిక్స్ చేసిన ఫొటో ఫ్రేమ్ బహుమతిగా ఇస్తే భలే ఉంటుంది. ఫొటోలు కొన్ని జ్ఞాపకాలను భద్రంగా ఉంచుతాయి. అలాగే పెర్ఫ్యూమ్ బహుమతిగా ఇచ్చినా బావుంటుంది. మీ మనసులో వారికి ప్రత్యేకమైన స్థానం ఉందని చెబుతూ మీ స్నేహ పరిమళం లాగనే సువాసనలు పంచే పెర్ఫ్యూమ్ ఇవ్వడం బాగుంటుంది. సన్ గ్లాసెస్ బహుమతిగా ఇవ్వొచ్చు. అది వారికి ఎండలో వాడుకోవడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. వారికి ఇష్టమైన షేడ్స్‌లో ఎంపిక చేసి ఇస్తే ఎంతో బాగుంటుంది.



**స్నేహితులతో గడపాలి**

స్నేహితులతో గడిపే సమయం చాలా విలువైనది. సమయానికి గుర్తుగా వారికి స్మార్ట్ వాచ్ బహుమతిగా ఇవ్వండి. మీ ఫ్రెండ్ తో గడిపిన ప్రతి సమయాన్ని మీరు గుర్తు పెట్టుకుంటారని ఆ బహుమతి చూపిస్తుంది. మీ ఫ్రెండ్‌కి పుస్తకాలు చదవడం అంటే ఇష్టమైతే మంచి పుస్తకం కొని బహుమతిగా ఇవ్వండి. మీ ఫ్రెండ్ ఎప్పటి నుంచో చదవాలని అనుకున్న రచయిత పుస్తకం మార్కెట్లో దొరికితే వెంటనే దానికి కొని వారికి బహుమతిగా ఇచ్చి సర్ప్రైజ్ చేయండి.

ఆడవారైతే స్కిన్ కేర్ ప్రొడక్ట్స్, బ్యూటీ ప్రొడక్ట్స్ ఇష్టపడుతుంటారు. మంచి సువానలు వచ్చే క్యాండిల్స్ అలాంటివి కూడా బహుమతులుగా ఇవ్వొచ్చు. కొందరికి చాక్లెట్స్ అంటే ఇష్టపడతారు. కొందరు గాడ్జెట్స్ ఇష్టపడతారు. ఫిటెనెస్ ట్రాకర్లు, పోర్టబుల్ స్పీకర్లు, పవర్ బ్యాంక్‌లు వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ కూడా సెలక్ట్ చేసుకోవచ్చు. కొంతమందికి సాఫ్ట్ టాయ్స్ అంటే చాలా ఇష్టపడతారు. అందమైన టెడ్డీ బేర్, మెత్తటి బన్నీ అయినా బహుమతిగా ఇవ్వండి.

కొందరికి మొక్కలంటే ప్రాణం. అలాంటి వారికి చక్కని ఇండోర్ ప్లాంట్స్ కొని బహుమతిగా ఇవ్వండి. అవి పెరుగుతూ ఉంటే మీ బంధాన్ని గుర్తు చేస్తూ ఉంటాయి. ఇలా మీ బెస్ట్ ఫ్రెండ్స్ అభిరుచికి తగ్గట్లు మీరు బహుమతులు ప్లాన్ చేసుకోండి. స్నేహితుల దినోత్సవం రోజు వారికి ఇచ్చి మీ సంతోషాన్ని పంచుకోండి.





# లేటుగా నిద్రపోతున్నారా? అయితే మీ పనైపోయినట్లే...

మనషి బ్రతకాలంటే ఆహారం ఎంత అవసరమో.. కంటి నిండా నిద్ర కూడా అంతే ముఖ్యం. నిద్ర లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. మీ వయస్సుకు తగ్గట్టు మీరు ఎన్ని గంటలు నిద్రపోవాలో మీకు తెలుసా? మీ వయస్సు బట్టి మీరు రోజుకు ఎన్నిగంటలకు నిద్రపోవాలి.. ఎన్నిగంటలకు నిద్ర లేవాలి.. ఏ వయస్సు వాళ్లు ఎన్ని గంటలు నిద్రపోవాలని చాలా మందికి తెలియదు. అలాంటి వారి కోసం ఈ సూచనలు ఎంతగానో ఉపయోగపడతాయి. నిరంతరం పనిచేసే మన శరీరానికి అవసరమైన విశ్రాంతిని ఇచ్చే ప్రక్రియ నిద్ర. మనం నిద్రపోయే ఈ సమయంలో మన శరీరంలోని వివిధ అవయవాలు తమ శక్తిని పునర్నిర్మించుకుంటాయి. అందుకే నిద్ర మన ఆరోగ్య సంరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. రాత్రిపూట సమయానికి నిద్రపోకుండా ఫోన్‌లో చూస్తూ మేలుకోవడం ఇప్పుడు చాలామందికి బాగా అలవాటైపోయింది. అయితే క్రమంగా ఈ అలవాటు మీకు పలు రకాల అనారోగ్య సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

### నిద్ర లేకపోతే అనారోగ్య సమస్యలు...



తగినంత నిద్ర లేకపోతే టైప్ 2 డయాబెటిస్, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అంతేకాదు నిద్రలేమి సమస్యతో బాధపడే వారికి ఊబకాయం కూడా వస్తుంది. ఎక్కువసేపు నిద్రపోకుండా ఫోన్ చూస్తూ గడిపేవారు క్రమంగా డిప్రెషన్‌లోకి వెళ్తారని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న బిజీ షెడ్యూల్స్ నేపథ్యంలో అర్ధరాత్రి వరకు మేలుకోవడం ఉదయం ఆలస్యంగా నిద్ర లేవడం ట్రెండ్‌గా మారుతోంది. అయితే దీనివల్ల మీకు తెలియకుండా పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నిద్రలేమి వల్ల అలసట, చికాకు, మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపించడం సర్వసాధారణం. ముఖ్యంగా పిల్లల ఎదుగుదలకు తగినంత నిద్ర అవసరం. నిద్రలేమి కారణంగా పిల్లలలో పెరుగుదలకు ఆటంకం కలుగుతుంది.

### మీరు ఎంత సేపు నిద్రపోవాలంటే...

వయస్సును బట్టి నిద్రపోయే విధానం ఉంటుంది. పసిపిల్లలు ఎక్కువ సేపు నిద్రపోతారు. అయితే క్రమంగా పెరిగే కొద్దీ నిద్రను పొందే సామర్థ్యం వయసుతో పాటు తగ్గుతూ వస్తుంది. అప్పుడే పుట్టిన బిడ్డ రోజుకు 11 నుంచి 14 గంటల వరకు నిద్రపోవడం అవసరం. 3 నుంచి 5 సంవత్సరాల మధ్య వయసు ఉన్న పిల్లలు కనీసం 10 గంటలు పడుకోవాలి. స్కూల్ కి వెళ్లే పిల్లలు రోజుకి కనీసం 8 గంటలు కచ్చితంగా పడుకోవాలి. ఇక 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు రోజు 7 నుంచి 9 గంటల పాటు నిద్రించేలా చూసుకోవాలి. 60 సంవత్సరాలు పైబడిన వారు కనీసం 6 గంటలైనా రోజుకు నిద్రపోవాలి. ప్రతిరోజు 9 నుంచి 10 మధ్యలో నిద్రపోవడం తెల్లవారుజామున నిద్రలేయడం మీ దినచర్యలో భాగంగా చేసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.



# ఇత్తడి పాత్రల్లో వంట చేస్తే.. ఆరోగ్యానికి నో ఢోకా!



ప్రస్తుతం చాలా మంది ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారు. వారిలో ఉన్న చెడు అలవాట్లను మానుకొని, మంచి అలవాట్లు చేసుకుంటున్నారు. తాజాగా చాలా మంది వంట ఎలాంటి పాత్రల్లో చేస్తే బాగుంటుందనే విషయాన్ని తెలుసుకుంటున్నారు. పూర్వకాలంలో కట్టెల పొయ్యిల మీద మట్టికుండల్లో వండిన ఆహారం తిని ఎక్కువ రోజులు ఆరోగ్యంగా జీవించే వారు. కానీ, ఇప్పుడు ప్లాస్టిక్, స్టిల్ మన వంటగది ఆక్రమించేశాయి. స్టీల్, ప్లాస్టిక్ చూడటానికి అందంగా.. కిచెన్ తళతళ మెరిసేలాచేస్తాయి. కానీ, వాటిలోని రసాయనాలు అనారోగ్యానికి గురి చేస్తాయన్న అవగాహన చాలా మందిలో పెరిగిపోయింది. అందుకే, ఇప్పుడు ప్రత్యామ్నాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొన్నిలోహాలతో తయారు చేసిన పాత్రల్లో వండిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేల చేస్తుందని నిపుణులు కూడా చెబుతున్నారు. అలాంటి వాటిల్లో ఇత్తడి ఒక్కటంట. ఇత్తడి పాత్రలపై సూక్ష్మజీవులు ఎక్కువ సేపు జీవించలేవట. అంతేకాదు ఆహార పదార్థాలు త్వరగా వేడి తగ్గకుండా ఉంటాయంట. ఈ పాత్రల్లో చాట్ పెట్టుకుని తాగడం వల్ల ఆహార పదార్థాలు వండుకుని తినడం వల్ల ఎన్నో పోషకాలు లభిస్తాయని పేర్కొంటు న్నారు. వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో మీకోసం.

### రుచి పెరుగుతుంది...

వంట చేసేందుకు ఇత్తడి పాత్రలను వాడటం వల్ల వాటి రుచి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. వీటిలో వంట చేసేటప్పుడు ఆపాత్రల నుంచి సహజ నూనెలు విడుదలవుతాయి. ఇవి సహజంగా ఆహారం రుచిని పెంచడమే కాదు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి.

### జీర్ణక్రియకు మేలు జరుగుతుంది..

చాయ్ తోపాటు ఇతర వంటకాలు ఇత్తడి గిన్నెల్లో చేయడం వల్ల జీర్ణ ఆరోగ్యానికి మేలు చేస్తుందని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ లు చెబుతున్నారు. ఇందుకంటే ఇత్తడి పాత్రల్లో వంటచేసేటప్పుడు వాటి నుంచి విడుదలైన పోషకాలు మనం తినే ఆహారంతోపాటు నేరుగా శరీరంలోకి ప్రవేశిస్తాయని అంటున్నారు. ఆహారం బాగా జీర్ణమై మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తగ్గిస్తాయని వారు చెబుతున్నారు.

### రోగనిరోధకశక్తి పెరుగుతుంది...

ఇత్తడిపాత్రల్లో వాటర్ నింపి పెట్టుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. రాత్రంతా ఇత్తడి పాత్రలో ఉంచిన నీటి తాగితే శరీరంలో రోగనిరోధకశక్తి పెరుగుతుందని చెబుతున్నారు. ఈ పాత్రలలో ఆహారాలను వండుకుని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని చెబుతున్నారు.

### చర్మ ఆరోగ్యానికి...



**ఇక ఇత్తడి చర్మానికి మేలు చేస్తుంది. రోజు చాయ్ తాగే అలవాటు ఉన్నవాళ్లు ఈ పాత్రలను వాడటం వల్ల ఇతర వంటకాల కోసం ఇత్తడి పాత్రలను వాడితే చర్మానికి కూడా మేలు చేస్తుంది. చర్మ సమస్యలు, మొటిమల నుంచి ఉపశమనం లభిస్తుంది.**

### ఈ వంటకాలు వండకూడదు...

మీరు ఇత్తడి పాత్రల్లో వంట చేసేటప్పుడు ఈ విషయాలు తప్పకుండా గుర్తుంచుకోవాలి. ఇత్తడిపాత్రల్లో నిమ్మకాయ, టమోటా వంటి సి విటమిన్ ఉండే ఆహారాలు ఎప్పుడూ వండకూడదు. వాటిని ఈ పాత్రలలో వండితే శరీరానికి హాని చేస్తుంది.

# శరీరంలో ఐరన్ లోపిస్తే.. ఏం అవుతుందో తెలుసా?




మన శరీరంలో రక్తం కీలక పాత్ర పోషిస్తుంది. దానిలో ఏ చిన్న సమస్య వచ్చినా పెను ప్రమాదంగా మారుతుంది. శరీరంలో తగినంత రక్తంలో లేకపోతే దాన్ని ఎనిమీయా అంటారు. శరీరంలో తగినంత ఐరన్ లేకపోవడం విటమిన్ లోపం వల్ల రక్తహీనత సమస్యకు దారి తీస్తుంది. అయితే, చాలా మంది ఈ సమస్యతో బాధపడుతున్నా.. రక్తహీనత ఉన్నట్లు వారికి తెలియదు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరినప్పుడు మాత్రమే రక్త పరీక్ష చేస్తుంటారు. ఆ సమయంలో శరీరంలో రక్తం తక్కువగా ఉన్నట్లు గుర్తిస్తారు. అయితే ఇలా కాకుండా రక్తహీనత ఉన్నవారికి కొన్ని లక్షణాలు ఉంటాయి. వాటిని గుర్తించి సకాలంలో వైద్యం తీసుకోవాలి. ఎనిమీయా ఉన్నవారిలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో వైద్యులు పేర్కొంటున్నారు. కాలేయం, కిడ్నీలు, గుండె వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎక్కువ రోజుల నుంచి మందులు వాడే వారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఇక క్యాన్సర్ చికిత్సలో భాగమైన కీమోథెరపీ చికిత్స్ తీసుకునేవారిలోనూ రక్తహీనత వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఏర్పడే ఎనిమీయా ఐరన్ లోపం వల్ల వస్తుంది. ఆహారం ద్వారా ఐరన్ లబించనట్లయితే లేదా శరీరంలో కణాలు ఆహారంలోని ఐరన్‌ను శోషించకపోవడం వల్ల ఈ రకం ఎనిమియా వస్తుంది.

### అలసట

రక్తహీనతతో బాధపడేవారు బాగా విశ్రాంతి తీసుకున్నా తీవ్రమైన నీరసం వేధిస్తుంది. రూజువారి పనులకు కూడా అలసిపోతుంటారు. ఏ పనిచేయాలన్న ధ్యాస ఉండదు.

### తలనొప్పి...

రక్తహీనత ఉన్నవారిలో విపరీతమైన తలనొప్పితోపాటు మైకం కమ్మినట్లుగా అనిపిస్తుంది. ఐరన్ లోపంతో బాధపడే వారిలో హిమోగ్లోబిన్ లెవల్స్ తగ్గడం వల్ల పెదవులు, గోర్లు, చర్మం పాలిపోయినట్లు అనిపిస్తుంది.




# చరిత్ర సృష్టించడమే మా లక్ష్యం..

- **'స్పిరిట్' పంపిణీపై నిర్మాతల సంచలన ప్రకటన!**

'ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్'తో ప్రతిష్టాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధికారికంగా వెల్లడించింది.

చరిత్ర సృష్టించడమే మా లక్ష్యం.. 'స్పిరిట్' పంపిణీపై నిర్మాతల సంచలన ప్రకటన!

దిశ, సినిమా: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'స్పిరిట్'. త్రిప్తి డిమ్రి హీరోయిన్ నటిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ నేపథ్యంలో, తాజాగా ఈ సినిమా థియేట్రికల్ పంపిణీకి సంబంధించి మేకర్స్ ఒక సంచలన ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా 'స్పిరిట్' చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి ప్రముఖ పంపిణీ సంస్థ 'ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్'తో ప్రతిష్టాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధికారికంగా వెల్లడించింది.

భారతదేశపు అతిపెద్ద స్టార్ ప్రభాస్‌పై కర్ణాటక ప్రజలు ఎప్పుడూ అపారమైన ప్రేమను చూపిస్తూనే ఉంటారని, ఈసారి వారందరితో కలిసి బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉన్నామని మేకర్స్ తెలిపారు. కర్ణాటక భారతీయ సినిమాకి అత్యంత బలమైన మార్కెట్లలో ఒకటి కావడంతో, ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ తో కలిసి రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ రెండు దిగ్గజ సంస్థల భాగస్వామ్యం ప్రేక్షకులకు మరుపురాని థియేట్రికల్ అనుభవాన్ని అందిస్తుందని, అంతేకాకుండా కర్ణాటక బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను నెలకొల్పుతుందని చిత్రబృందం తెలిపింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ చేసిన ఈ బిగ్ అనౌన్స్‌మెంట్‌తో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో పండగ చేసుకుంటున్నారు.

# 'సింహాద్రి'.. అతిపెద్ద సాహసమదే: రాజమౌళి

ఎన్టీఆర్ రాజమౌళి కాంబినేషన్‌లో 2003లో వచ్చిన చిత్రం 'సింహాద్రి' కెరీర్ పరంగా అటు జక్కన్నకు, ఇటు తారక్‌కు ఈ సినిమా ప్లస్ అయింది. యాక్షన్, ఎమోషన్స్, పాటలు అన్నీ ప్రేక్షకులను మెప్పించాయి. ఈ సినిమాలో ఓ సాహసోపేత నిర్ణయం గురించి రాజమౌళి ఓ సందర్భంలో వివరించారు. 'సింహాద్రి'లో వేలమంది అమాయకుల ప్రాణాలను కాపాడటానికి కథానాయకుడి పాత్ర ఒక మంచి వ్యక్తిని చంపాల్సి వస్తుంది. అది సినిమాలోనే కీలకమైన సన్నివేశం. ఈ ఆలోచనను రాజమౌళి తన కుటుంబ సభ్యులకు, చిత్రబృందానికి వివరించినప్పుడు.. ఒక హీరో ఇలా చేస్తే దాన్ని ప్రేక్షకులు అసలు అంగీకరించరని అన్నారట. అయితే, రాజమౌళి మాత్రం ఆ ఎమోషనల్ సీన్ ఈ కథకు ప్రాణమని నమ్మారు. ప్రేక్షకులు కచ్చితంగా దీనికి కనెక్ట్ అవుతారని నమ్మకంతో తెరకెక్కించారు. కట్ చేస్తే.. రాజమౌళి నమ్మకమే నిజమై, 'సింహాద్రి' ఆ సంవత్సరంలోనే అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.

అప్పట్లో చర్చనీయాంశంగా మారిన ఆ సన్నివేశం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది.

ఇక రామౌళి ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. రాజమౌళి దర్శకుడిగా పరిచయం అయిన మొదటి సినిమా స్టూడెంట్ నం.1.. ఎన్టీఆర్ కెరీర్‌లో మొదటి భారీ హిట్. ఈ కాంబినేషన్‌లో వచ్చిన రెండో సినిమా 'సింహాద్రి'.. ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసి ఎన్టీఆర్ స్థాయిని మాస్ హీరోగా అమాంతం పెంచింది. ఆ తర్వాత వచ్చిన యమదొంగ కూడా కమర్షియల్ హిట్. ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'.. ఇండియన్ సినిమా గర్వించదగ్గ పాన్‌ఇండియా చిత్రంగా నిలిచిపోయింది.

# నేనెప్పుడూ అలాంటి రోల్స్ చేయలేదు: కాజల్ అగర్వాల్



"గతంతో పోలిస్తే ఇప్పుడు దక్షిణాదిలో హీరోయిన్ పాత్రల్లో ఎంతో మార్పు వచ్చింది. సినిమాల్లో స్త్రీలను వస్తువుగా చూపించే సన్నివేశాల విషయంలో నేనెప్పుడూ గీత గీసుకుంటాను. ఇప్పటివరకూ అలాంటి పాత్రలు చేయలేదు. బాలీవుడ్‌తో పోలిస్తే నాకు సౌత్‌లో ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎక్కువగా వచ్చాయి. హిందీలో పెద్ద పెద్ద హీరోలతో నటించినా.. అంత గుర్తింపు రాలేదు. అందుకే సౌత్ సినిమాల వైపు వచ్చాను. నాకు కావాల్సింది ప్రాధాన్యత ఉన్న పాత్రలు. దక్షిణాదిలో అలాంటివి సమృద్ధిగా వచ్చాయి. అలాంటప్పుడు నేను బాలీవుడ్‌లో సగటు పాత్రలు ఎందుకు చేయాలి? భాష నాకు ఎప్పుడూ అడ్డు రాలేదు. బాలీవుడ్ చిత్రపరిశ్రమలో ఏదీ సమయానికి జరగదు. నాకు సమయపాలన ఎక్కువ. గతంలో ఒకసారి నేను సల్మాన్ ఖాన్ కోసం చాలాసేపు ఎదురుచూశాను. ఆయన సాయంత్రం వచ్చారు. సౌత్ సినిమాల్లో నటించినప్పుడు నాకు క్రమశిక్షణ బాగా అలవాటైంది" అని కాజల్ పేర్కొన్నారు.

ప్రస్తుతం, కాజల్ చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్న 'ది ఇండియా స్టోరీ'లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. శ్రేయాస్ తల్పడే కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందిన 'రామాయణ'లోనూ ఆమె కనిపించనున్నారు.



# 'RC17' లో హీరోయిన్ ఫిక్స్.. రామ్ చరణ్‌కు జోడీగా నేషనల్ క్రష్!




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'చిత్రంతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం ఆయన సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్‌తో కలిసి తన 17వ చిత్రం (RC17) చేయడానికి రెడీ అవుతున్నారు. ఈ బిగ్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఇప్పటికే రావడంతో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ చివరి దశకు చేరుకుందని, అతిత్వరలోనే షూటింగ్ కూడా పట్టాలెక్కనుందని సమాచారం. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఈ ప్రాజెక్ట్ గురించిన వార్తలు వరుసగా హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ సినిమా హీరోయిన్‌కు సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతోంది.

ఇందులో రామ్ చరణ్ సరసన నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించనున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటికే సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పుష్ప' ఫ్రాంచైజీతో రష్మికకు దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్, పాపులారిటీ దక్కాయి. అంతేకాకుండా రష్మికకున్న పాన్-ఇండియా గుర్తింపు, ఆమె నటన ఈ కథలోని హీరోయిన్ క్యారెక్టర్‌కు పక్కాగా సెట్ అవుతాయని సుకుమార్ భావిస్తున్నారట. ఇందులో హీరోయిన్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా, ప్రాధాన్యత ఉన్నదిగా ఉండబోతోందని టాక్. 'రంగస్థలం' లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత రామ్ చరణ్-సుకుమార్ కాంబోలో వస్తున్న ఈ సినిమాలో రష్మిక కూడా తోడైతే ప్రాజెక్ట్ రేంజ్ మరింత పెరుగుతుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# ఇకపై ఎవరి అనుమతి అవసరం లేదు!

ఇకపై ఎవరి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు.. ప్రశాంతత తనని వెతుక్కుంటూ వచ్చిందని చెబుతోంది అందాల తార అనుపమ పరమేశ్వరన్. జయాపజయాలతో సంబంధం లేకుండా వైవిధ్యమైన పాత్రల్ని ఎంచుకుంటూ ఎప్పటికప్పుడు సరికొత్త కథలతో ప్రేక్షకుల్ని పలకరిస్తున్న నాయికీమె. సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ చురుకుగా ఉండే అనుపమ.. ఇటీవల తన వ్యక్తిగత జీవితం గురించి వెల్లడిస్తూ భావోద్వేగభరితమైన క్యాప్షన్‌తో ఓ పోస్ట్ పెట్టింది. "కొన్నిసార్లు ప్రశాంతతని పొందాలంటే కొన్నింటిని వదిలేయాల్సి ఉంటుంది. ఈరోజు ఆ ప్రశాంతత నన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఇప్పట్నుంచి ఏం చేయలన్నా నా గొంతుని, జీవితాన్ని నేనే ఎంచుకుంటాను. ఇకపై ఎవరి అనుమతులు అవసరం లేదు. భయాలు లేవు. కేవలం నన్ను నేను తిరిగి వెతుక్కుంటూ.. దాదాపు మర్చిపోయిన జీవితంతో ప్రేమలో పడతాను. నాకు అండగా నిలిచి, నమ్మి, నా జీవితాన్ని ఎంతో ప్రేమతో నింపినందుకు అభిమానులందరికీ థ్యాంక్స్. నాకు అత్యంత అవసరమైన సమయంలో మీ ప్రతి సందేశం, ప్రార్థనలు నన్ను చేరాయి. నన్ను తిరిగి నా దారిలో నడిపించినందుకు యూనివర్స్‌కి థ్యాంక్స్. చివరికి ఏమాత్రం సంకోచించకుండా నాదైన జీవితాన్ని స్వేచ్ఛగా ఎంచుకుంటాన"ని రాసుకొచ్చింది. అలానే వేరొకరి అనుమతి, పాటల ఎంపిక, క్యాప్షన్‌ల కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఇలా పోస్ట్‌లు పెట్టడం సరదాగా ఉందని పేర్కొంది. అనుపమ త్వరలో శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న 'భోగి' సినిమాలో కందుల సులోచన రాణి పాత్రలో కనిపించనుంది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S